క్లుప్తంగా

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పరిశీలన



టెన్నిస్ కోర్టును పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం సుధాకర్

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్, టెన్నిస్ కోర్టు, జిమ్‌ను శనివారం గుంతకల్లు ఏడీఆర్ఎం సుధాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు టెన్నిస్, బిలియర్డ్స్ ఆడారు. క్రీడాకారులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తీరిక సమయాల్లో ఆటలు ఆడాలన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఓఎం పూర్ణ చంద్ర, సీనియర్ డీఎంఈ రమేష్, ఏడీఎంఈ అశోక్ గౌడ్, ఏడీఎస్ నారాయణ, సెక్రటరీ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

డీజిల్‌షెడ్ తనిఖీ



డీజిల్‌షెడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న పీసీఈఈ బ్రిజ్ మోహన్ మీనా

గుత్తి: గుత్తి రైల్వే లోకో డీజిల్‌షెడ్‌ను సికింద్రాబాద్‌కు చెందిన పీసీఈఈ (ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్) బ్రిజ్ మోహన్ మీనా శనివారం తనిఖీ చేశారు. అనంతరం వ్యాప్‌టెక్ ఇంజిన్లు, జీ9 ఎలక్ట్రికల్ ఇంజన్లు, పీ–4, జీ–4 ఇంజన్ల పనితీరును పరిశీలించారు. స్థానిక రైల్వే అధికారులు, సూపర్ వైజర్లతో సమీక్ష నిర్వహించారు. పని తీరును మరింతగా మెరుగు పరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన షెడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ రమేష్, డీఈఈ నాగేశ్వరరావు, ఏడీఎంఈలు అశోక్ గౌడ్, సుంకన్న, ఎస్ఎస్ఈ జనరల్ గోవిందరాజులు, శ్రీనివాస రావు, కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'అమ్మకానికి ప్రభుత్వ వైద్యం'



మాట్లాడుతున్న నాయకులు

తాడిపత్రిటౌన్: పేదలకు ఉచితంగా అందించాల్సిన వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుట్టా ప్రసాద్ ధ్వజమెత్తారు. పట్టణంలోని తన కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాదులు శివయ్య, శివరాజ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ వల్ల నిరుపేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడిసెల శ్రీనివాసులు, రమేష్, ప్రధాన కార్యదర్శి రాజేష్, కుళ్లాయప్ప, మల్లికార్జున, సుబ్బరాయుడు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

29న తాడిపత్రి టౌన్ బ్యాంకు ఎన్నికలు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి టౌన్ బ్యాంకు ఎన్నిక లు ఈనెల 29న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఇస్మాయిల్, బ్యాంకు సీఈఓ శివలక్ష్మి తెలిపారు. స్థానిక బ్యాంకులో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని గాంధీ కట్ట వద్ద ఉన్న సరస్వతి విద్యామందిరం ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. 9 మంది డైరెక్టర్ల కోసం జరుగనున్న ఎన్నికలకు ఈ నెల 23న బ్యాంకులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. 24న నామినేషన్ల ఉపసంహరణ, 25న పోటీల్లోని అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. అనంతరం ఆఫీసు బేరర్ల ఎంపిక, పాలకమండలిలో భర్తీకాని పోస్టులను భర్తీ చేస్తామని వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక



షేక్ హజియాతబసుంకు ప్రశంసా పత్రం అందజేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైందని ప్రిన్సిపాల్ లావణ్య శనివారం తెలిపారు. పాఠశాలలో 9 వతరగతి విద్యార్థిని షేక్ హజియాతబసుం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో గత శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కనిపించని 'త్రయోదశి' సందడి

- కొనుగోలుదారులు లేక వెలవెలబోయిన బంగారు దుకాణాలు
- ధరల పెరుగుదలే కారణమంటున్న వ్యాపారులు
- పనులు లేక కార్మికుల అవస్థలు



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న బంగారు దుకాణం

తాడిపత్రిటౌన్: బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో కొనుగోలుదారులు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. గత మూడు నెలలుగా ఇదే తంతు నడుస్తుండటంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. పనులు లేక పోవడంతో దుకాణాలపై ఆధారపడి బ్రతుకుతున్న వందలాది మంది కార్మికులు వీధిన పడుతున్నారు. శనివారం ధన త్రయోదశి సెంటిమెంట్ పనిచేస్తుందనుకున్న వ్యాపారులు, కార్మికులకు నిరాశే మిగిలింది. తాడిపత్రి మూడు జిల్లాల సరిహద్దు పట్టణం కావడంతో బంగారు కొనుగోళ్లు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. పట్టణంలోని మెయిన్ బజార్‌లో దాదాపు 200కి పైగానే బంగారు ఆభరణాలు దుకాణాలున్నాయి. వాటిలో దాదాపు 300 మందికి పైగా కార్మికులున్నారు. నిత్యం బంగారు కొనుగోలుదారులతో మెయిన్ బజార్ ఎంతో రద్దీగా కనిపించేది. పెళ్లిళ్ల సీజన్‌లో రద్దీ మరింతఎక్కువగా వుంటుంది. గత ఆగస్టులో 10 గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలు దాటడంతో పాటు గడిచిన మూడు నెలలుగా రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. అరకొర వ్యాపారులు సాగినా చిన్నపాటి ఆభరణాలకే వ్యాపారం పరిమితం కావడంతో దుకాణాలపై ఆధారపడి బతికే వందల మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి లేక కార్మికుల కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

బోణీ కూడా కాలేదు..

ధన త్రయోదశి రోజు బంగారం కొనుగోలు చేయడం ప్రజలు సెంటిమెంట్‌గా భావిస్తారు. దశాబ్ద కాలంలో తాడిపత్రిలో ధనత్రయోదశి రోజున బంగారు కొనుగోళ్లు ఆశాజనకంగానే నడిచివి. ఎంతో కొంత వ్యాపారం జరుగుతుందనుకున్న వ్యాపారుల ఆశలకు పెరిగిన బంగారు ధరలు నిరాశే మిగిల్చాయి. శనివారం (ధన త్రయోదశి) రోజు 10 గ్రాముల బంగారంపై రూ.వెయ్యి ధర తగ్గడం కొనుగోలుదారులను దుకాణాల వద్దకు తీసుకొస్తుందని ఊహించారు. (శుక్రవారం 24 క్యారెట్స్ 10 గ్రాముల బంగారం ధర 1.32.200 ఉండగా శనివారం 131200 అయింది). అయితే వారి ఆశలను అడియాసలు చేస్తూ వ్యాపారం అంతంత మాత్రంగానే సాగడం ..కొన్ని దుకాణాల్లో బోణీ కూడా లేకపోవడంతో కోలుకోలేని పరిస్థితి వచ్చిందని బంగారు వ్యాపారులు, కార్మికులు వాపోతున్నారు.

బంగారం కొనడం తగ్గించారు



మూడు నెలలుగా బంగారు కొనుగొలుదారులు రావడం లేదు. వ్యాపారాలు సాగడం లేదు. వచ్చినా చెవికమ్మలు, కాళ్ల గొలుసులకే వ్యాపారం పరిమితమవుతోంది. వ్యాపారులతో పాటు కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ధన త్రయోదశిపై ఆశ ఉన్నా నిరాశే మిగిల్చింది. ఇలా ఎంత కాలం ఉంటుందో తెలియని పరిస్థితి.

– మునేశ్వరెడ్డి , బంగారు ఆభరణాల వ్యాపారి, తాడిపత్రి

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కారుణ్య



హఫ్రీనా



శ్రావణి

శింగనమల(నార్పల): అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ –14, 17 జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో నార్పల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రాణించి , రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. అండర్ –14 విభాగంలో 8వ తరగతికి చెందిన కారుణ్య, హఫ్రీనా నవంబరు 1వ తేదిన మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో శ్రావణి (10 వతరగతి) విద్యార్థిని నూజివీడులో నవంబరు మూడోవారంలో రాష్ట్ర స్థాయి జరిగే పోటీలకు ఎంపికైంది. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పెన్షనర్స్ సంఘం కార్యాలయంలో శనివారం 25 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్ రెడ్డి, హనుమంతరెడ్డి, అశ్వత్థరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సుబ్రమణ్యం, వీరారెడ్డి, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

దోచుకోవడానికే చంద్రబాబు కుట్ర రాజకీయాలు





బీకేఎస్ మండలం రోటరీపురంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్, గుంతకల్లు మండలం కొంగనపల్లిలో మాట్లాడుతున్న నైరుతిరెడ్డి

బుక్కరాయసముద్రం: ప్రజల సొమ్ము దోచుకోవడానికే సీఎం చంద్రబాబు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ శింగనమల సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన బీకేఎస్ మండలంలోని కొర్రపాడు, రోటరీపురం, రెడ్డిపల్లి, చెదుల్ల, నీలాంపల్లి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శైలజానాథ్ తోపాటు మండల పరిశీలకుడు శ్రీరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ప్రజలకు చెప్పుకోదగ్గ శాశ్వతం పథకం ఒక్కటి కూడా లేదన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి, ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలే నేడు చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్మించిన 17 మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కోసం కుట్రలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు నిలదీస్తూ ఉండాలన్నారు. అందుకు వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముసలన్న, ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, రాధా మనోహర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: పేద విద్యార్థుల వైద్య విద్య కలను నిజం చేయాలన్న సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను నిర్మిస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ వైద్య విద్య కలను నాశనం చేస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కసాపురం, దోసలుడుకి, గుండాల తండా, మొలకలపెంట, కొంగనపల్లి, ఓబుళాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేదలకు ఉచిత వైద్యం అందకుండా పోవడమే కాకుండా, పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు కూడా భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రభుత్వంపై పోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రంగనాయకులు, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బాబూరావు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ఎంపీటీసీ నాగప్ప, మండల ఉపాధ్యక్షుడు హనుమంతు, మైనార్టీ మండల ప్రసిడెంట్ ఫక్రుద్దీన్, మండల యువజన విభాగం అధ్యక్షుడు శాంత నాయుడు, గ్రీవెన్స్‌సెల్ మండల అధ్యక్షుడు నక్కనదొడ్డి వెంకటేష్, ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టపాసుల విక్రయ కేంద్రాల పరిశీలన

గుంతకల్లు: స్థానిక రైల్వే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టపాసుల విక్రేయ కేంద్రాలను శనివారం సాయంత్రం డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పరిశీలించారు. నిబంధనల మేరకు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారా? లేదా అని ఆరా తీశారు. టపాసులు పేల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు వారు పాటించాలని సూచించారు.

టపాసుల విక్రయ కేంద్రాలపై దాడులు

స్థానిక రైల్వేగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టపాసులు విక్రయ కేంద్రాలపై శనివారం సాయంత్రం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 14 షాపుల్లో టపాసులు తయారు చేసిన తేదీ, ఎమ్మార్పీ , కస్టమర్ కేర్ నంబర్ లేకపోవడం గుర్తించారు. దీంతో ఒక్కొక్క షాపుకు రూ.3500 చొప్పన జరిమాన విధించారు.



టపాసుల విక్రయ కేంద్రం వద్ద డీఆర్ఎం, మున్సిపల్ కమిషనర్

అక్రమంగా టపాసులు విక్రయిస్తే చర్యలు

గార్లదిన్నె: అక్రమంగా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా హెచ్చరించారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ గార్లదిన్నెలో 2, కల్లూరులో 3 టపాసులు దుకాణాలకు లైసెన్స్ ఉందన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణాదారులు మాత్రమే టపాసులు విక్రయించాలన్నారు. అనధికారికంగా ఎవరైనా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ





గుంతకల్లులో మొక్కనాటుతున్న దృశ్యం, గుత్తిలో సైకిల్ తొక్కుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

గుంతకల్లు రూరల్/గుత్తి/శింగనమల/యాడికి/పుట్లూరు/గుత్తిరూరల్/పామిడి/పెద్దవడుగూరు/పెద్దపప్పూరు: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని అధికారులు సూచించారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు, గుత్తి, నార్పల, యాడికి, పుట్లూరు,పామిడి,పెద్దవడుగూరు,పెద్దపప్పూరు మండలాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. గుత్తిలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, డీఈ హేమచంద్ర, ఏఈలు గోవిందప్ప, కిరణ్, మున్సిపల్ మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే న్యాయమూర్తులు కాశీ విశ్వనాథ్ చారి, శ్వేత, న్యాయవాదులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయా మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏపీలు, వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

శింగనమల: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ మండలాల కమిటీలను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా యు.కాటమయ్య, నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడిగా మడిశెట్టి సురేష్ నియమితులయ్యారు.

- గార్లదిన్నె మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడిగా జి.గంగాధర్, హరిహర నాయుడు, ప్రధాన కార్యదర్శులుగా సీ.శ్రీనివాసులు, పి.ఆదినారాయణ, ఎస్.శ్రీనివాసులు, ఎం.బాలిరెడ్డి, కార్యదర్శులుగా ఎస్.అశోక్ కుమార్, డి.సుబ్రహ్మణ్యం, కె.ప్రసన్న లక్ష్మీ, తిరుపాలు, బి.చౌడప్పను నియమించారు. యూత్ విభాగం అధ్యక్షుడిగా సి.వేణుగోపాలరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పి.లక్ష్మీదేవి, రైతు విభాగం అధ్యక్షుడిగా ఎం.శ్రీనాథరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా టి.రామకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నారాయణస్వామి, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పి.రామచంద్ర, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ పీరా, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడిగా కె.లక్ష్మన్న, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా వి.కుళ్లాయప్ప, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా ఎస్.శివయ్య, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా జ్యోతిరాజేష్, వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు, చేనేత విభాగం అధ్యక్షుడిగా రంగం దాసు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా సి.భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా రామాంజిరెడ్డి, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా టి.నారపరెడ్డి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా జి.త్రిలోకనాథ్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా వై.ప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు.
- వైఎస్సార్‌సీపీ నార్పల మండల కమిటీ ఉపాధ్యక్షులుగా టి.రమణయ్య, నాగలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా రామయ్య, యు.రంగారెడ్డి, దంతని రాముడు, కాటంరెడ్డి, బాలనాగి గారి బయ్యన్న, కార్యదర్శులుగా ఎస్.రామచంద్ర, లక్ష్మీనారాయణ, ఎం.నరసింహులు, ఈ.వెంకటనారాయణరెడ్డి, పెద్దిరెడ్డి, రాజు, వి.అమర్‌నాథ్‌రెడ్డిని నియమించారు.



- వైఎస్సార్‌సీపీ శింగనమల మండల కమిటీలో ఉపాధ్యక్షులుగా పరంధామరెడ్డి, నాగభూషణ, అమర్‌నాథ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నల్లపరెడ్డి, నరసింహులు, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, నరసయ్య, కార్యదర్శులుగా నారాయణస్వామి, జి.శ్రీకాంత్‌రెడ్డి, ఎం.బాల గంగిరెడ్డి, శకుంతలమ్మ, వెంకటరమణను నియమించారు.
- బుక్కరాయసముద్రం మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా సత్యాలు, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా డి.సుబ్రహ్మణ్యంను నియమించారు.

'బెల్టు షాపులను నిర్మూలించాలి'

పెద్దపప్పూరు: కూటమి ప్రభుత్వంలో బెల్టుషాపులు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమని రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కరిస్టు) పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరనాగరాజు మండిపడ్డారు. శనివారం ఆయన పెద్దపప్పూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బెల్టు షాపులను అరికట్టాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తగు చర్యలు చేపట్టని పక్షంలో పార్టీ తరపున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థికి గాయాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని చెరువు కట్టపై సాయిబాబా గుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. అనంతపురంలోని బళ్లారి బైపాస్‌కు చెందిన భరత్ ఎస్ఆర్ఐటీ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కళాశాల ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా చెరువు కట్టపై కారు ఢీకొనడంతో భరత్ తీవ్ర గాయాల పాలయ్యాడు. అతడిని బెంగుళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీసీబీలో కారుణ్య నియామకం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో శనివారం కారుణ్య నియామకం కింద ఒకరికి స్టాఫ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. పామిడి బ్రాంచ్‌లో పనిచేస్తున్న స్టాఫ్ అసిస్టెంట్ రమేష్‌నాయక్ ఈ ఏడాది జూలై 19న విద్యుత్‌షాక్‌తో అకస్మాత్తుగా మరణించారు. దీంతో ఆయన సోదరుడు మోహన్‌నాయక్‌కు అదే స్థాయి ఉద్యోగం కల్పిస్తూ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఈవో కె.సురేఖారాణి, డీజీఎంలు విజయచంద్రారెడ్డి, రామ్‌ప్రసాద్, సుఖదేవబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేయించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 10వ వార్డు తిలక్‌నగర్ మదీనా మసీదు ఏరియాలో డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్డుపై నిల్వ ఉన్న మురుగును తీసివేయించి డ్రైనేజీ పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ ఇంతియాజ్, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

'స్థానికంగా లేని ఎస్ఓలను సస్పెండ్ చేయాలి'

పెద్దవడుగూరు: జిల్లా లోని కేజీబీవీల్లో స్థానికంగా లేని ఎస్ఓలను సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య తాడిపత్రి నియోజక వర్గ కార్యదర్శి నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న పనులకు నిధులు కేటాయించాలని , స్థానికంగా లేని వారి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తహసీల్దార్ ఉషారాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జిలాన్ మస్తాన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వరుస సెలవులతో బస్సుల కిటకిట



అనంతపురం వెళ్లే బస్సులో సీట్ల కోసం ఫీట్లు చేస్తున్న ప్రయాణికులు



రద్దీ కారణంగా బస్సు ఎక్కడానికి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

గుంతకల్లు: దీపావళి పండగ సందర్భంగా ఆదివారంతోపాటు సోమవారం సెలవు కలిసిరావడంతో ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్న ప్రభుత్వం.. అందుకు సరిపడా బస్సులు అందుబాటులో ఉంచకపోవడం, కొన్ని సర్వీసులకే ఉచిత ప్రయాణం వెసులుబాటు కల్పించడంతో ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. శనివారం సాయంత్రం 4.00 నుంచి 5.30 గంటల వరకూ గుత్తి, అనంతపురం వైపు బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల సహనానికి పరీక్షగా మారింది. దీంతో అటువైపు వెళ్లే ప్రయాణికులుతో ఆర్‌టీసీ బస్టాండ్ కిక్కిరిపోయింది. అయితే సాయంత్రం 5.30 గంటల సమయంలో ఒక్కసారిగి మూడు బస్సులు రావడంతో ప్రయాణికులు బస్సులో సీట్ల కోసం పరుగులు పెట్టారు. రద్దీ దృష్టిలో ఉంచుకుని బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

పొలాల్లో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

పెద్దవడుగూరు: పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ కోసం లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని విరుపాపురం, ఆవులాంపల్లి గ్రామాల్లో పత్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఓ మునికృష్ణ, ఏఈఓలు సునీత, వీఏఏ లు స్వాతి, మానస, ఉష, ఎంపీఈఓలు లక్ష్మీనారాయణ, అర్చన, శిరీష, పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్ యోజన'ను సద్వినియోగం చేసుకోండి

శింగనమల: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ రఘు సూచించారు. శనివారం శింగనమలలోని రామాలయం వద్ద పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పథకానికి ప్రభుత్వ రూ.78 వేల సబ్సిడీ ఇవ్వడంతోపాటు బ్యాంకులు రుణాలిస్తాయన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్, ఎంపీడీఓ భాస్కర్, గ్రామ సచివాలయ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'రచ్చబండ'

శింగనమల(నార్పల): నార్పల మండలంలోని దుర్గం, సిద్దలాచెర్ల, గొల్లపల్లి, బండ్లపల్లి, పప్పూరు , తుంపేర గ్రామాల్లో ఆదివారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ, గ్రామ కమిటీలు ఎంపిక చేస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఖాదర్‌వలి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త , మాజీ మంత్రి సాకే శైలజానాథ్, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, పార్లమెంట్ కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలుపాల్గొని విజయవంతం చేయాలన్నారు.

'వేరుశనగ రైతులను ఆదుకోవాలి'

శింగనమల: వేరుశనగ రైతులను కూటమి ప్రభు త్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం మట్లగొంది, చిన్నమట్లగొంది, సలకంచెరువు, బందార్లపల్లి గ్రామాల్లో వేరుశనగ పంట పొలాలను పరిశీలించి. రైతులతో మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్, నాయకులు జయరాముడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లి శివారులో శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మారుతి, శివగంగయ్య పని నిమిత్తం గుత్తికి బయలుదేరారు. అదే గ్రామానికి చెందిన తిరుమలేష్ అనే యువకుడు గ్రామంలోకి వెళ్తుండగా మలుపులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు తిరుమలేష్‌ను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.